చిన్నా అక్షరాభ్యాసానికి కావలసిన సరంజామా లిస్ట్ భర్త సుదర్శన్ కిచ్చింది శారద. రేపే అక్షరాభ్యాసం. ఎల్లుండి కాన్వెంట్‌లో ఎల్‌కేజీ లో చేర్పించాలి. వారం రోజుల క్రితమే కాన్వెంట్ కెళ్ళి వివరాలు తెలుసుకొని వచ్చాడు సుదర్శన్.

ఐదువేలు డొనేషన్, నెలకు మూడు వందలు ఫీజు. అప్లికేషన్‌తో బర్త్ సర్టిఫికేట్ జత చేయాలని చెప్పారు.

మునిసిపల్ ఆఫీస్‌లో బర్త్ సర్టిఫికేట్ కోసం దరఖాస్తు యిచ్చి అటునుంచి అటే మార్కెట్‌కెళ్ళి పూజ సామాగ్రి తేవాలని నిర్ణయించుకొని సుదర్శన్ బయలుదేరేలోగా కరంట్ పోయింది.

ఎదురింటిలోనూ, పక్కింటిలోనూ కరంట్ ఉన్నా తమ యింటిలోనే పోయింది. ఫ్యూజ్‌లన్నీ బాగానే ఉన్నాయి. అంటే పోల్‌మీద కనక్షన్ ఊడిందన్నమాట. సంబంధిత శాఖకు ఫోన్ చేయాలనుకున్నాడు సుదర్శన్. కానీ రేపే పూజ. అతిధులొస్తారు. కరంట్ లేకుంటే యిబ్బందని సుదర్శన్ తండ్రి తనే స్వయంగా వెళ్ళి లైన్‌మాన్‌ని వెంటబెట్టుకు వచ్చాడు.



# దైవపాలన

అతగాడు వస్తూనే జేబులోంచి ఆకుపచ్చ గుడ్డతీసి, ముడుపు కట్టమన్నాడు. "ముడుపా? ఎందుకూ? ఏమిటీ?" ఆశ్చర్యపోయాడు సుదర్శన్.

"ఇది దైవపాలన కదా సాబ్! మా ఆఫీస్‌లో మూడు మతాలున్నారు కొందరికి పసుపు గుడ్డల ముడుపు యివ్వాల. కొందరికి ఎర్ర గుడ్డలు నాకు ఆకుపచ్చ" అని వివరించినా సుదర్శన్‌కి అర్థం కాలేదు.

ఓరి అమాయకుడా! అన్నట్టు అతని వైపు చూసి "ఏవో కోర్కెలతో గుడికెళ్ళి, కోర్కె తీరాక ముడ్పు చెల్లించి, గుండు గీయించుకోరా సాబ్? అదే విధంగా కరంట్ కావాలన్న కోర్కె తీరాలంటే ముడ్పు కట్టాల. గుండు మీ యిష్టం" వివరించాడు లైన్‌మాన్.

"ప్రభుత్వం మీకు జీతం ఇస్తోంది. ఇది మీ డ్యూటీ. మళ్ళీ ముడుపెందుకు" లా పాయింట్ పీకాడు సుదర్శన్.

"ఆఫీస్కెళ్ళి, దస్కత్ సేసి, కూకోడానికే జీతం! కోరిక తీరాలంటే ముడ్పు కట్టాల! దైవపాలన సాబ్!" నవ్వాడు లైన్ మానవుడు.

అయిష్టంగానే "ఎంత?" అని అడిగాడు సుదర్శన్.

"గుడిలో దర్శనం, స్పెషల్ దర్శనం ఉండవా? అలాగే" మళ్ళీ నవ్వాడు.

"గుడిలో ధర్మదర్శనం కూడా వుంటుంది" ఉక్రోషంగా అన్నాడు సుదర్శన్.

"అయితే మీ చేతికి ధర్మచక్రం కట్టి పోతాన్లే. అందల ప్రయారిటీ నంబర్, తేదీ ఉండు. ఆ ప్రకారం వచ్చెద" సంచిలోంచి చక్రం తీసాడు లైన్‌మానవుడు. దాని మీద నెల తర్వాత తేదీ ఉంది. సుదర్శన్ గుండె గుభేల్ మంది.

సుదర్శన్ తండ్రి ముందుకొచ్చి ఇరవై ముడుపు కట్టాడు.

"ఎల్లుండి వస్తాసాబ్" ముడుపు జేబులో పెట్టుకుని బయలుదేరబోతున్న లైన్ మానవుడిని ఆపాడు తండ్రి.

"గుడిలో సాధారణ, స్పెషల్, సూపర్‌స్పెషల్ దర్శనాలుండుగదా. ఆ విధమున ఇరవైకి రెండు రోజుల తర్వాత, యాభైకి ఒకరోజు తర్వాత, వందకి తక్షణం కనక్షన్ దొరకబడును సాబ్" వివరించాడు లైన్ మానవుడు.

ఏడుస్తూ లైనేశ్వరుడికి వందరూపాయిల ముడుపు చెల్లించి, మునిసిపల్ ఆఫీస్‌కి బయలుదేరాడు సుదర్శన్.

మునిసిపల్ ఆఫీస్ కొత్తగా కనిపించింది. ఒకప్పుడు జనం తీర్థ స్థలంలాగ తండోపతండాలుగా చెట్ల కింద, రాళ్ళగుట్టల మీద నిరీక్షిస్తూ రేపురా, మాపురా అని తిప్పుతున్న సిబ్బందిని తిట్టుకుంటూ ఉండేవారు. ఇప్పుడు చెట్లు, గుట్ట

**ప్రఫుల్ల చంద్ర**

లూ ఖాళీగా ఉన్నాయి! అలా పది అడుగులేసి కొత్తగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ గదిలో చూస్తే అక్కడ కుర్చీల్లో ఓ పాతిక మంది వరకూ నిరీక్షిస్తున్నారు.

ఆ కుర్చీల కెదురుగా వున్న టేబుల్ మీద ఒక ప్రక్కగా బ్యాలట్ బాక్సుల్లాంటివి మూడు వున్నాయి. వాటి మీద సాధారణ, ప్రత్యేక, తత్కాల్ అని రాసిన కాగితాలు అంటించి ఉన్నాయి. టేబుల్ వెనక కుర్చీలో క్లర్క్ కూర్చుని ఉన్నాడు. అతని ఎదుట ఒక రిజిస్టర్, కవర్లు, గమ్‌బాటిల్ ఉన్నాయి.

ఆ క్లర్క్ హుషారుగా కబుర్లు చెబుతూ చక చకా పనిచేస్తోంటే మునిసిపల్ సిబ్బంది చక చకా పనిచేయడమా? అని దిగ్భ్రమ చెందిన సుదర్శన్ తన వంతు రాగానే వెళ్ళి క్లర్క్‌కి విషయం వివరించాడు.

"మీకేది కావాలి?" అంటూ బ్యాలట్ బాక్స్‌ల వైపు చూపించాడు క్లర్క్.


"అయ్యో! నాకు బ్యాలట్ బాక్స్ వద్దండీ! బర్త్‌సర్టిఫికేట్ కావాలి"

ఆ క్లర్క్ గలగలా నవ్వుకొని "మీ వివిధ కోర్కెలు ఒక్కొక్క దానికీ మూడురకాల రేట్లు ఉంటాయి. బర్త్ సర్టిఫికేట్‌కి ఆర్డినరీ అయితే యాభై రూపాయలు. రెండు నెలల్లో సర్టిఫికేట్ యిస్తాం. స్పెషల్ అయితే వంద. రెండు వారాల్లో పని జరుగుతుంది. తత్కాల్ అయితే మూడొందలు. గంటలో యిచ్చేస్తాం" వివరించాడు.

అతడు వివరిస్తూ ఉండగానే అటెండర్



కన్నోజు లక్ష్మీకాంతం వ్రాసిన "చార్మినార్ నానీలు" పుస్తకాన్ని డా॥ ఎన్.గోపిగారు ఆవిష్కరిస్తున్న చిత్రం. ఎడమనుండి: శ్రీ టి. భీష్మాచారి, ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణి, శ్రీ కన్నోజు లక్ష్మీకాంతం (రచయిత), డా॥ మసన చెన్నప్ప (అధ్యక్షులు), డా॥ ఎన్.గోపి, శ్రీ సుధామ, డా॥ తిరునగరి




వచ్చి అక్కడ నిరీక్షిస్తున్న కొందరికి సర్టిఫికేట్లు యిచ్చి తత్కాల్ బాక్స్ తీసుకెళ్ళాడు.

"చూసారుగా! ఆ బాక్స్‌ని అరగంట కొకసారి పెద్దసారువాడి వద్దకు తీసుకెళ్తాడు. మరో అరగంటలో సంతకాలతో వస్తాయి. ఈ బాక్స్‌ని రెండు వారాలకొకసారి, దీన్ని రెండు నెలల కొకసారీ పెద్ద సారువాడికి పంపుతాం" చెప్పాడు క్లర్క్.

నీరసంగా అతని చేతిలో మూడొందలు పెట్టాడు సుదర్శన్. ఆ డబ్బుని కవర్లో పెట్టి, అంటించి, కవరు మీదా రిజిష్టర్‌లోనూ ఏదో రాసి తత్కాల్ డబ్బా రాగానే దానిలో వేసాడు క్లర్క్. అప్పటికి పని ఒత్తిడి తగ్గి, కబుర్లకు తీరిక చిక్కగా బద్ధకంగా ఒళ్ళు విరచుకొని -

"ఇదంతా ఎంతో అన్యాయంగానూ, ఘోరంగానూ అనిపిస్తోంది కదూ" అని నవ్వేసి "ఇంతకుముందు లంచం అనేవారు. తీసుకునేవాడికి జంకు, ఇచ్చేవాడికి బెరుకుగా ఉండేది. పని అవుతుందో లేదో గ్యారంటీ ఉండేది కాదు". ఆ లంచ భాగ్యం కొన్ని సీట్లకే పరిమితం. దాంతో లాభదాయక సీట్లకోసం మాలో మాకే పోటీ ఉండేది. ఇప్పుడు దైవపాలన వచ్చాక అంతా పబ్లిక్కే. పారదర్శకమే. అందరికీ హ్యాపీస్. అన్నిపనులకూ అందుబాటు రేట్లు, కాలనియమం ఉన్నాయి. పని జరుగుతుందన్న గ్యారంటీ ఉంది. ముడుపులెంత వస్తున్నాయో ఖచ్చితమైన లెక్క ఉంటుంది. అందరికీ పెర్సంటేజ్ ప్రకారం వాటాలుంటాయి. ఇది దైవపాలన. రాక్షస పాలన కాదుకదా. అందరూ హ్యాపీస్" దైవపాలన లాభాలు వివరించసాగాడు.

ఏడవలేక నవ్వాడు సుదర్శన్.

ఆ ముఖం చూసి ముచ్చట పడి టీ తెప్పించి యిచ్చాడు క్లర్క్.

తర్వాత కన్నుగీటి, రహస్యంలాగ తగ్గుస్వరంలో చెప్పాడు "సూపర్ తత్కాల్ అని మరో పథకం వుంది. పనిని బట్టి దానికి సూపర్ రేట్లు

ఉంటాయి. బర్త్ సర్టిఫికేట్ కోసం వెయ్యి రూపా యిలిస్తే చాలు. సంతకం పెట్టి బ్లాంక్ సర్టిఫికేట్ యిచ్చేస్తాడు పెద్దసారువాడు. ఖాళీల్లో మీయిష్టం వచ్చిన పేరు, యిష్టం వచ్చిన తేదీ మీరే పూర్తి చేసుకోవచ్చున్నమాట."

వింటోంటే దిగ్భ్రాంతిగా ఉంది సుదర్శన్ కి. చుట్టూ చూసి యింకాస్త దగ్గరగా రమ్మన్నట్టు సైగ చేసాడు క్లర్క్.

"ఒకసారి ఏం జరిగిందంటే - ఒక పెద్దమ నిషి సూపర్ తత్కాల్ డబ్బు కట్టి పెద్దసారువాడి సంతకం ఉన్న కాగితం మీద - నేనొక చవ టని! లంచగొండిని! నా బిడ్డలు నిజంగా నాకు పుట్టినవారు కాదు. పక్కింటి వాడికి పుట్టారు! - అని రాసి దాని కాపీలు తీసి దినపత్రికలకు, టీవీ ఛానల్స్‌కీ పంపి నానా రభస చేసాడు!" చెప్పి పకపకా నవ్వేసాడు క్లర్క్. తర్వాత నవ్వు ఆపి-మరింత రహస్యంగా-

"పెద్దసారువాడు తక్కువ తిన్నాడా? తెలివైన ముండావాడు లెండి! సూపర్ తత్కాల్ కాగితాల మీద వేరే విధంగా సంతకాలు పెడతాడు! పేప ర్లలో, టీవీల్లో తన పేరు మారుమోగుతోంటే అయన పోలీసు స్టేషన్ కెళ్ళి భారీ ముడుపు కట్టి - అది నా సంతకం కాదు, ఫోర్జరీ చేసా రంటూ కేసుపెట్టాడు. దాంతో రభస చేసిన పెద్ద మనిషి జైలుకీ, పెద్దసారువాడు పార్టీకి!"

కిమ్మనకుండా, ముడుపుకోరకుండా ఫ్రీగా వినేవాడు దొరకడం ఎంత అదృష్టం! క్లర్క్‌కి హుషారుగా వుంది. అదీ కాక రద్దీలేదు. దైవ పాలన గురించి జనాభిప్రాయాన్ని అనుకూలం గా మలచవలసిన గురుతరబాధ్యత తన భుజస్కంధాల మీద ఉందని ఫీలయి, "ప్రజలు అనవసరంగా గోలచేస్తున్నారు. ఆ రెండు పత్రికలూ, ఆ ఒక్క న్యూస్ ఛానల్ రభస చేస్తు న్నాయిగానీ సరస్వతి అమ్మవారు విద్యాలయా ల్లో దైవపాలన ఎప్పుడో మొదలుపెట్టెయ్యలేదా? రేపు మీ అబ్బాయి కాన్వెంట్‌లో చేరేటప్పుడు డొనేషన్ కట్టడంలేదా? అక్కడ డొనేషన్, బిల్డిం గ్ ఫండ్, కాపిటేషన్ ఫీజు అని ముద్దుముద్దుగా ఇంగ్లీషులో చెబుతున్నారు. ఇక్కడ ముద్దు ముద్దు గా ముడుపు అని తెలుగులో అంటున్నందుకు బాధగా ఉందా? అక్కడ యిష్టంగా వేలకు వేలు ఒక్కోసారి లక్షలు కూడా చెల్లిస్తూ ఇక్కడ వంద లు యివ్వడానికి కష్టం ఎందుకుసార్?" అం టూండగానే - అటెండర్ సర్టిఫికేట్ తెచ్చి సుదర్శన్ కిచ్చాడు.


ఈ పద్ధతి బాగానే ఉన్నట్టు అనిపించింది సుదర్శన్‌కి. హృదయం తేలికపడింది. "ఉత్తుత్తి జీవో లాగ యిది ఉత్తుత్తి సర్టిఫికేట్ కాదుకదా!" సాక్ చేసాడు.

పకపకా నవ్వేసాడు క్లర్క్. తర్వాత చటుక్కు న జ్ఞాపకం వచ్చినట్టు "మాస్టారూ! కార్య సాఫల్యం అయిందికదా. ప్రక్క సెలూన్‌లో గుం డు గీయించుకొని, ఆ ప్రక్క కొలనులో స్నానం చేసిపొండి. గుండు వల్ల ఒక ప్రయోజనం ఉంది సుమా" అన్నాడు.

"ఔను! కొబ్బరి నూనె మిగులు" మళ్ళీ జోక్ చేసాడు సుదర్శన్.

"అదిసరే ఇంకో ప్రయోజనం ఉంది. దువ్వు కోడానికి వీలైనంత పొడవైన జుట్టు మీ గుండు మీద మొలిచేవరకూ మునిసిపల్ ఆఫీసుతో మీకె న్ని పనులు పడినా అన్నిటిమీదా తత్కాల్ ము డుపులో సగం రాయితీ యిస్తాం!" ఘనంగా ప్రకటించాడు క్లర్క్.

ఇది మరీబాగుంది అనిపించింది సుదర్శ న్‌కి. కానీ స్నానం చేయాలంటే వేరే బట్టలు లేవు. ఆలోచిస్తూ సెలూన్ పక్క నుంచి వెళ్తోం




టే సెలూనయ్య పిలిచాడు. కట్టుకొని స్నానం చేయడానికొకటి, తర్వాత తుడుచుకోడానికీ తువ్వాళ్ళు అద్దెకు దొరుకుతాయని చెప్పాడు. ఈ ఏర్పాటు బాగానే ఉందనిపించి గుండు గీయించుకొని, తువ్వాలు మొలకి చుట్టుకొని, బట్టలు కొలను మెట్టుమీద పెట్టి నీటిలో దిగాడు సుదర్శన్.

స్నానం చేస్తూ మెట్టువైపు చూడగా అతని గుండె ఝల్లుమంది.

ఎక్కడ నుంచి వచ్చిందోగానీ ఒక కోతి రాజా బట్టల వద్దకూర్చుని జేబులు చెక్‌చేస్తోంది! అది బట్టలు ఎత్తుకుపోతే తనపని గోవిందా! గుండె గుబగుబలాడుతోంటే గబగబా స్నానం ముగించి, మెట్టుమీదకొచ్చి కోతిరాజాని అదిలించాడు. అంతే... అది షర్ట్ జేబులోని బర్త్ సర్టిఫికేట్ చేజిక్కించుకొని, పక్క యింటి మీదకు హైజంప్ చేసింది.

"నా సర్టిఫికేట్! నా సర్టిఫికేట్!!" అని అరుస్తూ అక్కడకు పరిగెత్తాడు సుదర్శన్. ఆ కోతి రాజా సుదర్శన్‌ని చూసి డాన్స్ కోతీ డాన్స్ టీవీ ప్రోగ్రామ్ లాగ డాన్స్ చేస్తూ మరింత ఎత్తయిన భవనానికి జంప్ చేసింది.

వెర్రిగా అరుస్తూ అక్కడికి పరుగు తీసాడు సుదర్శన్.

నీ లెక్కేంటి అన్నట్టు అతనివైపు ఒక లుక్ పారేసి, అచ్చం కోతిలాగ పళ్ళికిలించి నవ్వుతూ చిద్విలాసంగా ఆ సర్టిఫికేట్‌ని ఉండ చుట్టి నోట్లో వేసుకుంది కోతిరాజా.

కాయా, కసరూ తినవలసిన కోతి కాగితం తినేస్తోంటే దీనికిదేంపొయ్యే కాలం అని సుదర్శన్ లబలబ లాడుతూండగా –

"ఏమండీ, లేవండీ... ఏమిటా కలవరింతలు? పీడకలగానీ వచ్చిందా? చిన్నాకి అక్షరాభ్యాసం కదా! పంతులుగారు వచ్చే టైమ్ అవుతోంది. అబ్బా... లేవండీ" భర్తని కుదిపి కుదిపి లేపుతోంది శారద. ●